ఆకట్టుకున్న అకడమిక్ ఫెయిర్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్‌లో అకడమిక్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో విద్యార్థుల సరికొత్త ఆలోచనలతో తమ నమూనాలను ప్రదర్శించారు. ఒకే భూమి ఒకే కుటుంబం ఒకే భవిష్యత్ అనే వసుధైక కుటుంబం థీమ్‌తో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టును ఎంపిక చేసుకొని తమ ఆలోచనలకు పదునుపెట్టారు. వివిధ ఆటలు కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనను పాఠశాల ప్రిన్సిపాల్ నిషీరా జా, వైస్ ప్రిన్సిపాల్ రాహత్ రషీద్ తిలకించి విద్యార్థులను అభినందించారు.

బీఆర్ఎస్‌తోనే బీసీల అభ్యున్నతి

హిమాయత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీతోనే బీసీల సంక్షేమాభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్ అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేని బీసీ సంక్షేమ పథకాలను కేవలం బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షుడు పూసల సత్యనారాయణ, కార్యదర్శి యు.నగేష్, సంయుక్త కార్యదర్శి లింగం, కార్యనిర్వాహక కార్యదర్శి సాయి వర్ధన్ పాల్గొన్నారు.

నత్తనడకన పోల్‌చీటీల పంపిణీ

- ఇప్పటికి 70 శాతం మాత్రమే పంపిణీ
- గేటు వద్ద స్లిప్‌లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్న బీఎల్‌వోలు
- జీహెచ్ఎంసీ అధికారులకు నిత్యం ఫిర్యాదుల వెల్లువ

బంజారాహిల్స్: పోలింగ్‌కు ఇంకో రెండు రోజులే గడువు ఉండగా ఓటర్లకు పోల్ చీటీల పంపిణీ కార్యక్రమం ఇంకా పూర్తి కాలేదు. బీఎల్‌వోలే ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటరు చేతికి పోల్‌చీటీలు అందించాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రెండు వారాలుగా పోల్‌చీటీల పంపిణీ కార్యక్రమాన్ని బీఎల్‌వోలు తమ పరిధిలో చేపట్టారు.

◆ ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 258 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇప్పటిదాకా 70 శాతం మాత్రమే పోల్ చీటీల పంపిణీ పూర్తయింది. బీఎల్‌వోలు కేవలం బస్తీలకే పరిమితం కాగా కాలనీలు, అపార్ట్‌మెంట్లలో చీటీల పంపిణీకి ముందుకు రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ ఖైరతాబాద్ రిటర్నింగ్‌అధికారితో పాటు సహాయ రిటర్నింగ్ అధికారులకు ఇతర జీహెచ్ఎంసీ అధికారులకు కాలనీవాసుల నుంచి నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయి. తమకు ఇంకా పోల్‌చీటీలు పంపిణీ కాలేదంటూ పలువురు ఫిర్యాదులు చేస్తున్నారు.

◆ పది రోజుల క్రితం ఎన్నికల సంఘం అధికారులు బీఎల్‌వోలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఓటరూ చేతికి పోల్ చీటీలు అందించాలని ఆదేశించారు. అయితే బీఎల్‌వోలు మాత్రం చాలా చోట్ల ఓటరు వద్దకు వెళ్లకుండానే ఆ ఇంట్లో పని మనుషులకు, డ్రైవర్లకు, గేటు వద్ద ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు.



పంజగుట్టలో పోల్ చీటీలు పంపిణీ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

◆ దీంతో ఓటర్ల చేతికి పోల్‌చీటీలు అందకపోవడంతో తమకు ఇంకా పోల్ చీటీలు అందడం లేదంటూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. బీఎల్‌వోలను సంప్రదిస్తే తాము నిన్ననే ఇచ్చేశామంటూ సంబంధిత సాక్ష్యాలను కూడా అధికారులకు చూపిస్తున్నారు.

◆ నేరుగా ఓటరు చేతికి పోలింగ్ స్లిప్ అందకపోవడం వల్లనే ఈ సమస్య తలెత్తుతున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు.

◆ ఈ నెల 30న పోలింగ్ జరగనుండగా మంగళ, బుధవారాల్లో పూర్తి శాతం పోల్ స్లిప్‌ల పంపిణీకి అధికారులు బీఎల్‌వోలకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

◆ ప్రతిరోజూ పోల్ స్లిప్‌ల పంపిణీపై సమీక్ష కూడా జరుగుతోంది. మిగిలి ఉన్న 30 శాతం స్లిప్‌లను రెండు రోజుల్లో పంపిణీ చేసే విధంగా బీఎల్‌వోలపై ఒత్తిడి పెరుగుతున్నది. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్ డివిజన్లలో 258 పోలింగ్ బూత్‌లకు గాను 2,96,014 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,53,968 పురుషులు కాగా, 1,42,011 మహిళలు ఉన్నారు. ఇతరులు 35 మంది ఉన్నారు.

సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్

బంజారాహిల్స్: ఈ నెల 30న జరగనున్న పోలింగ్ నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నగరానికి పెద్ద ఎత్తున కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయి. ప్రజలకు మేమున్నామనే భరోసాను కల్పించి వారిలో ధైర్యం నూరిపోసేందుకు ఎక్కడికక్కడ సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నాయి. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్, సింగాడికుంట, నందినగర్ తదితర ప్రాంతాల్లో కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఓటు వేయడానికి నిర్భయంగా పోలింగ్ బూత్‌లకు రావాలని మీ భద్రత కోసం మేమున్నామనే ఆలోచనను ఇచ్చేందుకు మీరు బస్తీల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.



జహీరానగర్‌లో ఫుట్ పెట్రోలింగ్ చేస్తున్న కేంద్ర బలగాలు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి: చింతల



దుర్గా భవానీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో చింతల రామచంద్రారెడ్డి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5 దుర్గా భవానీనగర్‌లో గిరిజన మహిళలతో ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని రోడ్ నెం.5 దుర్గా భవానీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తే పేదలకు ఏడాదికి నాలుగు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. అధికార పార్టీ పేదలను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి పేరిట మభ్య పెడుతున్నదని వారి మాటలు నమ్మవద్దని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా తాను బీజేపీలోనే ఉన్నానని, ప్రజల మధ్యే తిరిగానని మిగతా నాయకుల్లాగా ఇంటికే పరిమితం కాకుండా పార్టీలు మారలేదన్నారు. ఈ సందర్భంగా ఆయనకు బస్తీవాసుల నుంచి మంచి స్పందన లభించింది.

కుటుంబ పాలనకు చరమగీతం పాడండి

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్



సుల్తాన్‌నగర్ సభలో పాల్గొన్న అజహరుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధిలో మార్పు రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌లలో పాదయాత్ర నిర్వహించారు. బస్తీల్లో సమస్యలను అడిగి తెలుసుకొని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. కుటుంబపాలన అంతం కావాలన్నా, అహంకార, అరాచకపాలన పోవాలంటే కాంగ్రెస్‌కు ఓటువేయాలని కోరారు. తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ అని, తిరిగి కాంగ్రెస్‌కు అధికారం అందించాల్సిన ఆసన్నమైందన్నారు. రహమత్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుల్తాన్‌నగర్‌లో ఏర్పాటు చేసి సభలో పాల్గొని ప్రసంగించారు. ఇంచార్జ్ నవీన్‌యాదవ్, కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, భవానీశంకర్, ఉపేందర్‌రెడ్డి, అసద్ పాల్గొన్నారు.

గల్లీ.. గల్లీలో ప్రజల ఆశీర్వాదం తీసుకున్నా

- ప్రజా స్పందన చూస్తే 50 వేల మెజార్టీ ఖాయంగా కనిపిస్తోంది
- ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం

బంజారాహిల్స్: బడుగు బలహీన వర్గాల మనోభావాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగుతున్నదని ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఫిలింనగర్‌లోని బసవతారకం నగర్‌లో, వెంగల్‌రావు పార్కులో, ఎంఎస్ మక్తాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి తాను చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి భారీ స్పందన కనిపిస్తున్నదన్నారు. ఎక్కడికెళ్ళినా తనను ప్రజలు సాదరంగా ఆహ్వానిస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు 50 నుంచి 60 వేల మెజార్టీ ఖాయంగా వస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. ఇప్పటికే అన్ని డివిజన్లలో తనను గెలిపించాలంటూ ప్రజల ఆశీర్వాదం తీసుకున్నానన్నారు. అన్ని బస్తీలు, కాలనీలు తిరిగానన్నారు. ఓటు వేసి తమ హక్కును కాపాడుకోవాలని కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత తీసుకోవాలన్నారు.



వెంగళ్‌రావు పార్కులో వాకర్లతో మాట్లాడుతూ..



ఎంఎస్ మక్తా ప్రజా ఆశీర్వాద సభలో దానం..

బీఆర్ఎస్, బీజేపీ ఒకే తానుముక్కలే...





తుమ్మల బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలు దివంగత సీఎల్పీ నేత పీజేఆర్ పాలనను కోరుకుంటున్నారని ఖైతరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని తుమ్మలబస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పీజేఆర్ కుమార్తెగా ప్రజల నుంచి తనకు లభిస్తున్న ఆదరణ మరువలేనిదన్నారు. ఎక్కడ చూసినా పీజేఆర్ గురించే మాట్లాడుకుంటున్నారని ఆయన చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ గుర్తించుకుంటున్నారని గుర్తు చేసుకున్నారు. అదే అభివృద్ధి జరగాలని తనను గెలిపించాలని కంకణం కట్టుకున్నారనే విషయాన్ని ఈ ప్రచారంలో అడుగడుగునా కనిపిస్తున్నదన్నారు. చాలా చోట్ల ప్రజలు తమ సమస్యలను చెప్పుకుంటున్నారని వాటిని నోట్ చేసుకుంటున్నామని తాను గెలవగానే మొదటి ప్రాధాన్యతగా ప్రధాన సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని ఎవరికి ఓటు వేసినా ఆ రెండింట్లో ఒకరికి వేసినట్లు అవుతుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రమే ప్రజలకు నమ్మకమైన పార్టీగా ఆమె వెల్లడించారు.

జనసంద్రమైన మోదీ రోడ్ షో





హిమాయత్‌నగర్: మోదీ..మోదీ అనే నినాదాల నడుమ నగరంలో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్ షో సోమవారం సందడిగా సాగింది. ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచి మొదలైన రోడ్ షో చిక్కడపల్లి, నారాయణగూడ, వైఎంసీఏ సర్కిల్ మీదుగా కాచిగూడ వీర్ సావర్కర్ విగ్రహం కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వీర్ సావర్కర్ విగ్రహానికి ప్రధాని మోదీ పూలు జల్లి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాని అభివాదం చేస్తూ సాగుతున్న రోడ్ షోలో అభిమానులు మోదీ..మోదీ, వందే మాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో జై కొట్టారు.

కార్తీక పున్నమి వేళలో...



బంజారాహిల్స్: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనంతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి.. సోమవారం కావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు కనుల పండువగా జరిగాయి.



బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి వ్రతాలు నిర్వహించుకున్నారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని శివాలయంలో, ఫిలింనగర్ దైవసన్నిధానంలో విశేష అభిషేకాలు నిర్వహించారు.

బీజేపీ వైపే ప్రజలు

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి



పాదయాత్రలో ఓటు వేయాలని కోరుతున్న లంకల

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టాలని ఓటర్లు దృఢనిశ్చయంతో ఉన్నారని, దేశాన్ని నడుపుతున్న ప్రధాని నరేంద్రమోదీ న్యాయకత్వం పట్ల నమ్మకంతో ఉన్నారని ఆ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. సోమవారం కృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ మేనిఫెస్టోని ఓటర్లకు వివరించారు. మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నేతలు అలపాటి లక్ష్మీనారాయణ, బంగారు ప్రశాంత్, ప్రేమ్‌కుమార్, శాంతికుమార్, హరీష్‌యాదవ్, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఐపీసీతో బంగారు తెలంగాణ సాధ్యం




పార్టీ మేనిఫెస్టోని ఓటర్లకు వివరిస్తున్న చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: బంగారు తెలంగాణ రావాలంటే ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. సోమవారం మధురానగర్, రాజీవ్‌నగర్‌కాలనీలతో పాటు పలు బస్తీలలో ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టోని వివరించారు. ఈల గుర్తుకు ఓటువేసి ఐపీసీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్మిక సంక్షేమానికి కృషి చేసిన కాంగ్రెస్‌ను గెలిపించండి: సర్వే సత్యనారాయణ

హిమాయత్‌నగర్: దేశంలోని లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించి, వారి సామాజిక భద్రత కోసం కార్మిక చట్టాలు తీసుకొచ్చి, కార్మిక సంక్షేమం కోసం కృషిచేసిన కాంగ్రెస్ పార్టీని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ఐఎన్‌టీయూసీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి రాష్ట్రంలోని కార్మికవర్గానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కార్మికుల సామాజిక, ఆర్థిక దోపిడీ, అసమానతలను తొలగించడంలో పూర్తి ఉపాధి కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు హక్కులు, సంక్షేమం, భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, రాష్ట్రం ఏర్పడ్డాక గత పది సంవత్సరాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ఏఐసీసీ మాజీ సభ్యులు, డాక్టర్ సి.యాదగిరి, ఐఎన్‌టీయూసీ తెలంగాణఅధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్ అభివృద్ధికి పాటుపడే వారిని,
మీకు అందుబాటులో ఉండేవారిని
అసెంబ్లీకి పంపించండి
వ.సం అభ్యర్థి పేరు ఫోటో గుర్తు
1 చింతల రామచంద్రారెడ్డి
2
3
4
5
6
7
పోలింగ్ తేది :
30 నవంబర్, 2023
సమయం :
ఉ. 7 గం.ల నుండి
సా. 5 గం.ల వరకు
బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వండి...ఖైరతాబాద్ రూపురేఖల్ని మనమంతా కలిసి మార్చుదాం. అధికార, ధన బలంతో కాదు ప్రజాబలంతో ముందుకెళ్తున్న నన్ను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి
కమలం పువ్వు
గుర్తుకు ఓటేద్దాం
చింతల రామచంద్రారెడ్డి
ఖైరతాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి